# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 9, ఆగస్టు 2026


## గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి

### శిథిలావస్థలోని సంక్షేమ వసతిగృహాలకు నూతన భవనాలు కట్టాలి: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్

మంచిర్యాల, ఆగస్టు 8, ప్రభాతవార్త




అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు, శిథిలావస్థకు చేరిన సంక్షేమ వసతిగృహాలకు ప్రభుత్వం వెంటనే సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలోని పలు గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో విద్యార్థులకు తరగతి గదులు, భోజనశాల, క్రీడా మైదానాలు వంటి కనీస వసతులు అందడం లేదన్నారు. మరోవైపు సంక్షేమ వసతిగృహాలు శిథిలావస్థకు చేరినా నూతన భవనాలు నిర్మించకుండా విద్యార్థులను అద్దె భవనాలకు తరలించడం సరికాదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్, కో కన్వీనర్లు నిచల్, విష్ణు, నాయకులు అజయ్, అభిషేక్, యశ్వవనందం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



### ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో

## పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన

■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త

ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్నందున అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ, రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, నీటిపారుదల శాఖ ఈ.ఈ. శ్రీనివాస్‌లతో కలిసి అధికారులు, ప్రజాప్రతినిధులతో వర్షపాతం, సాగునీటి లభ్యత, పంటల వైవిధ్యీకరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటిలో మొదటి ప్రాధాన్యత తాగునీటికే ఇవ్వాలని, సాగునీటి వనరులు మరియు కాలువల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుపై మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా మార్గనిర్దేశం చేయడంతో పాటు కనీస మద్దతు ధరల ప్రాముఖ్యతను వివరించాల న్నారు. నీటి విడుదల, కాలువల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, అధికారులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి రైతు ప్రయోజనాలే లక్ష్యంగా నిష్పక్షపాతంగా పని చేయాలని తెలిపారు. రైతులు నీటి ప్రతి బొట్టును పొదుపుగా వినియోగించుకోవాలని,


మిగతా 2లో..

## ప్రాజెక్టుల నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తాం

### ❋ ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలతో రైతులకు లాభాలు : నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఆగస్టు 08, ప్రభాతవార్త:

జిల్లాలోని ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇరిగేషన్ అడ్వైజరీ సమావేశం అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు అవసరమైనంత వర్షపాతం నమోదైనప్పటికీ, కొన్ని మండలాల్లో 20 శాతం లోటు ఉందన్నారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ముందస్తు కార్యాచరణతో సాగునీటి నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు. ఎస్సారెస్పీ ద్వారా జిల్లాలో సుమారు 35 వేల ఎకరాలకు, కడెం ప్రాజెక్టు ద్వారా 6 వేల ఎకరాలకు మిగతా 2లో..




## జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమ వసూళ్లకు యత్నం..

### ఇద్దరు అరెస్ట్ ✪ ఆసిఫాబాద్ డిఎస్పీ అశోక్ వెల్లడి

ఆసిఫాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:




కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఆసిఫాబాద్ డీఎస్పీ బి.అశోక్ శనివారం తెలిపారు. డిఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం బుతే దేవేందర్, దుప్త సురేష్ సోషల్ మీడియా జర్నలిస్టులుగా పరిచయం చేసుకుని జిల్లా వ్యవసాయ అధికారిపై ఒత్తిడి తెచ్చి తొలుత రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం బెదిరింపుల ద్వారా జులై 26న రూ.1.30 లక్షలు నగదుగా తీసుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై జిల్లా వ్యవసాయ అధికారి బోర్కుట్ మిగతా 2లో..

## కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్ఎంఎస్ నిరంతర పోరాటం

### ❁ అసంఘటిత రంగ కార్మికులను సంఘటితం చేస్తాం: నరెడ్ల శ్రీనివాస్

### ❁ హెచ్ఎంఎస్ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఎండి హుస్సేన్ నియామకం

నస్పూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త




కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాల కల్పన, ఉద్యోగ భద్రత కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాటం చేస్తూ అండగా నిలుస్తుందని ఆ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేరుతో కార్మికులను దోపిడీ చేస్తూ తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని శ్రీనివాస్ విమర్శించారు. అంగన్‌వాడీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆర్టీసీ, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, 108, 104 ఉద్యోగులు, ప్రైవేట్ హాస్పిటల్ కార్మికులు, హమాలీలు, భవన నిర్మాణ కార్మికులు, రవాణా, భవన నిర్మాణ అనుబంధ రంగాల కార్మికులు తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, కనీస వేతన చట్టాలను అమలు చేయాలని, మిగతా 2లో..

# జిల్లా వ్యవసాయ అధికారిని బెదిరించి అక్రమ వసూళ్లకు యత్నం..

(మొదటిపేజీ తరువాయి)

వెంకటి ఫిర్యాదు మేరకు ఆగస్టు 5న ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా వాట్సాప్ చాట్స్, సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు, స్క్రీన్‌షాట్లు తదితర డిజిటల్ ఆధారాలను సేకరించారు. ఆగస్టు 7న హైదరాబాద్‌లో నిందితులను అదుపులోకి తీసుకుని ఆసిఫాబాద్‌కు తరలించారు. అనంతరం కోర్టులో రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీలు, ఫోన్ కాల్స్ తదితర సాక్ష్యాలను సేకరించి నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ బి.అశోక్ పేర్కొన్నారు. దర్యాప్తు అధికారి, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి హెచ్‌ఎంఎస్ నిరంతర పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో హెచ్‌ఎంఎస్‌ను మరింత బలోపేతం చేస్తూ వివిధ రంగాల్లో కమిటీలు ఏర్పాటు చేసి సభ్యత్వాన్ని విస్తరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎండి హుస్సేన్‌ను హెచ్‌ఎంఎస్ మంచిర్యాల కార్పొరేషన్ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. నూతనంగా నియమితులైన హుస్సేన్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం, సంఘ విస్తరణ కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపర్తి సాయి కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎండి షఫీ, కార్యదర్శి తగరం శ్రీనివాస్, నాయకులు దున్నపోతుల రమేష్, పి. శ్రీనివాస్, రాజిరెడ్డి, ఎండి అజీమ్, ఏ. మహేష్, చందు, సురేష్, పవన్ పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. రైతులు కంది వంటి ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో కంది సాగు విస్తీర్ణాన్ని 6 వేల ఎకరాల నుంచి 10 వేల ఎకరాలకు పెంచినట్లు వెల్లడించారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని, తెలంగాణ జలసిరి పథకం కింద ఈ ఏడాది 2,026 ఫామ్ పాండ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకోగా 3,000 వరకు రైతులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ రాజేంద్ర ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన అధికారి రమణ, విలేకరులు, అధికారులు పాల్గొన్నారు.

# నీల్వాయి ఎస్సైగా నాగరాజు

**వేమనపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త**



నీల్వాయి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా జి. నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన జగదీశ్వర్‌రెడ్డి నెన్నెలకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన పోలీస్ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

# అవసరం మేరకే నీటి విడుదల చేయాలి

## పంటలు, పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, ఆగస్టు 08, ప్రభాతవార్త:**



రైతుల పంటల అవసరాలు, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా నీటిని వినియోగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నీటి వృథా కాకుండా ప్రతి ఎకరాకు నీరు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. శనివారం లక్ష్మణచందా మండలం బాబాపూర్ గ్రామంలోని చెరువును కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. చెరువు నీటి మట్టం, సాగులో ఉన్న పంటల విస్తీర్ణాన్ని అధికారులతో కలిసి సమీక్షించారు. ఆయకట్టు, పంటల రకాలను బేరీజు వేసిన తర్వాతే నీటిని విడుదల చేయాలని సూచించారు. అనంతరం చెరువు తూము పరిస్థితి, కట్ట దృఢత్వాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక రైతులతో నేరుగా మాట్లాడి, సాగునీటి సరఫరాపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన అధికారి రమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణపై రైతులకు విస్తృత అవగాహన

(మొదటిపేజీ తరువాయి)

కర్ణమామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే నారు పోసిన రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా ఆదివారం ఉదయం కడెం రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే, ఈ నెల 15వ తేదీ నుండి వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత మరియు చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ రోగులకు నూతన చేయూత పింఛన్ల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని, అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదే రోజున సంగారెడ్డిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా, మిగిలిన ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కూడా ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బింగి ప్రవీణ్ నియామకం

## - బీజేపీ బలోపేతానికి, ఓబీసీల అభ్యున్నతికి కృషి చేస్తా

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 08, ప్రభాతవార్త**



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మంచిర్యాల జిల్లాకు చెందిన బింగి ప్రవీణ్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ శుక్రవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నియామకాలను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన బింగి ప్రవీణ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్‌కు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ రావుకు, అలాగే మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఓబీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాధాన్యత కల్పించేందుకు బీజేపీ చేస్తున్న కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా, పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, ఓబీసీ వర్గాల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ఆయన హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**తాండూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :**

తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గోగర్ల ప్రవీణ్( 26 )అనే యువకుడు మృతి చెందినట్లు తాండూర్ ఎస్సై ప్రసాదరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రేచిని గ్రామానికి చెందిన ప్రవీణ్ తాండూర్ ఐబి నుండి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఎన్టీఆర్ కాలనీ సమీపంలో గేదె అడ్డు రావడంతో కింద పడ్డాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని తండ్రి గోగర్ల రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రవీణ్ సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# మురుగునీటి కాలువ పునరుద్ధరణ

## - కోయవాగులో పారిశుధ్య సమస్యకు పరిష్కారం..

## - పంచాయతీ యంత్రాంగం చర్యలు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామపంచాయతీ పరిధిలో మట్టి, బురదతో నిండిపోయి మురుగునీటి పారుదల నిలిచిపోయిన సైడ్ డ్రెయిన్ (మోరి)ని పంచాయతీ యంత్రాంగం పునరుద్ధరించింది. గత కొన్ని రోజులుగా కాలువలో మురుగునీరు నిలిచిపోవడంతో స్థానికులు దుర్గంధం, దోమల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ చింతపురి లక్ష్మీ, ఉపసర్పంచ్ మోరాయి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సుస్మిత, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించారు. సక్షన్ యంత్రం సహాయంతో కాలువలో నిలిచిన మురుగునీరు, బురదను పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. అడుగుభాగంలో పేరుకుపోయిన దట్టమైన మట్టిని కూడా తొలగించారు. మురుగునీరు సాఫీగా పారేలా, భవిష్యత్తులో కాలువ అడుగుభాగంలో మట్టి పేరుకుపోకుండా పీసీసీ (సిమెంట్ కాంక్రీట్)తో బెడ్ ఏర్పాటు చేశారు. దీంతో కాలువ అడుగుభాగం సమతలంగా మారి మురుగునీరు నిలిచిపోకుండా ముందుకు సాఫీగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. కాలువ పునరుద్ధరణతో గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడటంతో పాటు దుర్గంధం, దోమల సమస్య తగ్గి స్థానికులకు ఉపశమనం కలిగిందని పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



# ఆకట్టుకున్న సంఘం శరణం గచ్ఛామి నాటకం

**- సిఈఆర్ క్లబ్‌లో అంబేద్కర్ జీవితాధారిత నాటిక ప్రదర్శన - ఆదివారం సత్యశోధన నాటకాన్ని వీక్షించాలని నిర్వాహకుల పిలుపు**

**నస్పూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితంపై ప్రదర్శించిన సంఘం శరణం గచ్ఛామి నాటకం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నస్పూర్ సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో ఈ నాటికను ప్రదర్శించారు. సింగరేణి యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ నాటకాన్ని వీక్షించేందుకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అంబేద్కర్ జీవిత విశేషాలను నేటి తరానికి కళ్లకు కట్టేలా ఎంతో ఆసక్తిగా ఈ నాటికలో ప్రదర్శించారని వీక్షకులు అభిప్రాయపడ్డారు. కాగా, ఆదివారం సాయంత్రం ఇదే ప్రాంగణంలో మహాత్మా జ్యోతిబా పూలే జీవితం ఆధారంగా రూపుదిద్దుకున్న సత్యశోధన నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనకు సైతం ప్రజలు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ప్రతినిధులు బాజీ సైదా, ముస్కే సమ్మయ్య, మోతుకూరి కొమురయ్య, ఎస్ ఓ టూ జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం సుమలత, డీజీఎంలు అనిల్ కుమార్, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, స్థానికులు, చిన్నారులు హాజరయ్యారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నాటక ప్రదర్శనను ప్రారంభిస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్



## భక్తులు ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లించుకోవాలి

**- పోలీసులు భక్తులకు ఉత్తమ సేవలందించాలి: ఏసిపి కిరణ్**

**క్యాతన్‌పల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త**

బొక్కల గుట్ట మైసమ్మ బోనాల జాతరకు వచ్చే భక్తులు ప్రశాంత వాతావరణంలో మొక్కులు చెల్లించు కోవాలని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ కోరారు. శనివారం స్థానిక ఎం.ఎన్.ఆర్ గార్డెన్‌లో సమావేశం ఏర్పాటు చేసి బందోబస్త్ నిర్వహణకు పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధారి మైసమ్మ జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సుమారు 250 మంది తో బందోబస్త్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే ప్రతి పోలీస్ విధిగా లాఠీ, రైన్ కోట్, గొడుగు వెంట ఉంచుకోవాలని అన్నారు. ప్రధాన రహదారి పై, క్యూ లైన్‌ల వద్ద ట్రాఫిక్ జామ్ జరగకుండా విధులు నిర్వహించాలని అన్నారు. వాహనాల పార్కింగ్, వాహనాల దారి మళ్లింపు చర్యలు సక్రమంగా చేపట్టాలని తెలిపారు. భక్తులకు ఉత్తమ పోలీస్ సేవలు అందించాలని అన్నారు.

## గాంధారి మైసమ్మ ఆలయంలో శాంతి హోమం

**క్యాతన్‌పల్లి, ఆగస్టు 08,ప్రభాత వార్త**

గాంధారి మైసమ్మ ఆలయ ఆవరణలోలో శనివారం శాంతి హోమం నిర్వహించారు. వేద పండితులు హోమం, పూజ క్రతువులు నిర్వహించగా కమిటీ సభ్యులు కందునూరి రాజయ పోరెడ్డి మొండిలు మరో ఇద్దరు కుటుంబ సమేతంగా యజ్ఞంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కుల సమ్మయ్య మాట్లాడుతూ ఆదివారం బోనాల జాతర నిర్వహించే ముందు ఆలయ పరిసరాల్లో శాంతి హోమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 250 బోనాలు ఏర్పాటు చేశామని, బోనం ఎత్తు కోవాలని అనుకొనే భక్తులు ఆలయ కమిటీ వారిని సంప్రదించాలని సూచించారు. ఆలయ కమిటీ, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



## అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ సదుపాయం

**- ఎమ్మెల్యే గడ్డం వినోద్ తక్షణ చర్య**

**బెల్లంపల్లి, ఆగస్టు 08, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ మీటర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే గ్రామానికి చెందిన గోస్కుల ఓదేలు, శిలువేరు కళ ఇళ్ల ముందు చీకటి నెలకొని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలను బుచ్చయ్యపల్లి సర్పంచ్ జాడి మహేశ్వరి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ రామ్ మనోహర్‌తో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలంటూ ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి అంగన్వాడి కేంద్రానికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన పోల్స్ మరియు లైన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే సంబంధిత ప్రాంతాల్లో వెలుతురు కల్పించారు. తక్షణ స్పందనతో సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ మరియు విద్యుత్ శాఖ అధికారులకు బుచ్చయ్యపల్లి గ్రామ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## తెలంగాణ ఉద్యమకారుల సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా రామిడి కుమార్

**క్యాతన్‌పల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త**



రామకృష్ణపూర్ పట్టణానికి చెందిన సీనియర్ తెలంగాణ ఉద్యమకారుడు రామిడి కుమార్ తెలంగాణ ఉద్యమకారుల సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొడేటి శంకర్ గౌడ్ నియామక ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో రామిడి కుమార్ చేసిన సేవలను గుర్తించి పదవిని అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం మరింత చురుకుగా పని చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించారు. ఈ సందర్భంగా రామిడి కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆశయాలకు అనుగుణంగా అంకితభావంతో పని చేస్తామని పేర్కొన్నారు.

## చేయూత పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 8: ప్రభాతవార్త:**

రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో చేయూత సామాజిక భద్రతా పెన్షన్లు, ఆర్థిక సహాయ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ బుర్స పోచయ్య, పంచాయతీ కార్యదర్శి సాయి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, డయాలసిస్ రోగులకు కొత్త పెన్షన్లను ప్రభుత్వ ఆదేశాలమేరకు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ.4,016, ఇతర అర్హులైన వర్గాలకు రూ.2,016 చొప్పున నెలవారీ పెన్షన్ అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు/ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు సంబంధిత వర్గానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. అర్హత కలిగిన వారు ఆగస్టు 11 నుంచి రాజంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇప్పటికే పెన్షన్ కోసం దరఖాస్తు చేసిన వారు కూడా ఆగస్టు 11న పాత దరఖాస్తుకు బదులుగా కొత్త చేయూత పెన్షన్ దరఖాస్తు ఫారం సమర్పించాలని, అసలు ధ్రువీకరణ పత్రాలతో పాటు జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని అధికారులు తెలిపారు.

## రాజంపేటలో నూతన ఎల్ఈడీ డివైడర్ లైట్ల ఏర్పాటు

**ఆసిఫాబాద్, ఆగస్ట్ 8, ప్రభాతవార్త :**



రాజంపేట గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం నూతన ఎల్ఈడీ డివైడర్ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి సర్పంచ్ బూర్స పోచయ్యతో కలిసి లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్ఈడీ లైట్ల ఏర్పాటుతో రహదారులపై వెలుతురు మెరుగుపడి ప్రజలకు భద్రత, సౌకర్యం కలుగుతుందని తెలిపారు. గ్రామ సుందరీకరణకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, వార్డు సభ్యురాలు బొట్టుపల్లి లావణ్య, పంచాయతీ కార్యదర్శి జె.సాయికృష్ణ, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యా భారతి హైస్కూల్‌లో బోనాలు, గోరింటాకు సంబరాలు

**తాండూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :**

మండలంలోని కిష్టంపేట విద్యా భారతి ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం సాంప్రదాయ బద్ధంగా బోనాలు, గోరింటాకు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను మరచిపోకుండా విద్యార్థినులతో పాటు మహిళా ఉపాధ్యాయులు అందరూ కలిసి ఈ వేడుకలను జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. పాడిపంటలు పశు సంపద తో పాటుగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో, విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, అమ్మవారి దీవెనలు అందరికీ ప్రసాదించాలని కోరారు. మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గోరింటాకు వేడుకలను జరుపుకున్నారు.




అమ్మవారికి పూజలు చేసి గోరింటాకు సంబరాలు జరుపుకుంటున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



# అన్నాభావు సాటే విగ్రహం ఏర్పాటు చేస్తానని హామీ

## - గైక్వాడ్ గంగాధర్

భైంసా, ఆగస్టు 08, ప్రభాతవార్త: తానూర్ మండలం బొంద్రట్ గ్రామంలో అన్నాభావు సాటే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత అటవీ శాఖ అధికారి గైక్వాడ్ గంగాధర్ మాట్లాడుతూ.. బొంద్రట్ గ్రామంలో మహనీయుడు అన్నాభావు సాటే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అన్నాభావు సాటే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విగ్రహ ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ గైక్వాడ్ గంగాధర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలేకర్ ఉత్తమ్, గ్రామస్తులు, అన్నాభావు సాటే అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీసీ హక్కుల సాధనకై చలో నల్గొండ

## - తెలంగాణ బీసీ హక్కుల నేత సుంకెట పోశెట్టి



భైంసా, ఆగస్టు 08, ప్రభాతవార్త: బీసీలను అన్ని రంగాల్లో అణిచివేతకు గురిచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలిగేలా ఈ నెల 9న నిర్వహించే బీసీల సామాజిక న్యాయ పోరాట సభను జయప్రదం చేయాలని తెలంగాణ బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి పిలుపునిచ్చారు. ఈ సభకు జిల్లాలోని బీసీ ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై ఆత్మగౌరవాన్ని చాటిచెప్పాలని కోరారు. నల్గొండలో జరిగే ఈ సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత ఐఎస్ అధికారి టి. చిరంజీవులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కలిసిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కళ్యాణ మండపం టెండర్ అప్రూవల్ కాపీని అందజేసిన విఠల్ రెడ్డి

భైంసా, ఆగస్టు 08, ప్రభాతవార్త: దేగాం గ్రామంలోని తన నివాసంలో తానూర్ మండలం అంగిర్గా శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కళ్యాణ మండప నిర్మాణ టెండర్ అప్రూవల్ కాపీని ముధోల్ మాజీ శాసనసభ్యులు జి.విఠల్ రెడ్డి శనివారం గ్రామ సర్పంచ్, గ్రామస్తులకు అందజేశారు. టెండర్ అప్రూవల్ చేసినందుకు ముఖ్యమంత్రి ఎన్. రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఈ సందర్భంగా గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూమాబాయి శివయప్ప, మహారాజ్ లక్ష్మణ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ సర్పంచ్ పోశెట్టి, బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ పోతారెడ్డి, మాజీ సర్పంచ్ బాలాజీ, ధర్మపురి నర్సింహులు, సాయినాథ్, లక్ష్మణ్, నాగోరావ్, బాపూరావు, సిద్ధార్థ్, ధర్మపురి భూమన్న, అరవింద్, శ్రీనివాస్, చిన్నాన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా గోరింటాకు సంబురాలు

## సంప్రదాయం ఉట్టిపడేలా ఆషాఢం వేడుకలు - గోరింటాకు విశిష్టతను వివరించిన పాఠశాల ప్రత్యేకాధికారిణి హరిత

కోటపల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త: మంచిర్యాల జిల్లా కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి హరిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు కలిసి పరిసరాల్లోని గోరింటాకును సేకరించారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా పాటలు పాడుతూ గోరింటాకును దంచి ముద్దగా తయారు చేశారు. తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు చేతులకు గోరింటాకు పెట్టుకుని సంబురంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేకాధికారిణి హరిత మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఉన్న శాస్త్రీయ, ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పే ఇలాంటి వేడుకల ద్వారా విద్యార్థుల్లో వాటి పట్ల అవగాహన, ఆసక్తి మరింత పెంపొందుతాయని ఆమె పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోలాహలం, పాటలతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.



కేజీబీవీలో ఆషాఢ మాస సంబరాలు



# బండ్రేవ్ తండాలో తల్లిపాల వారోత్సవం

సారంగాపూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త: మండలంలోని బండ్రేవ్ తండా అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌట్ల(బి) సెక్టార్ ఐసీడీఎస్ సూపర్వైజర్ లలిత హాజరై మాట్లాడారు. నవజాత శిశువులకు, పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమైనవని, అవి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని వివరించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ వత్సల, గ్రామానికి చెందిన మహిళలు కవిత, లత, వినీత, అనిత, సునీత, ఏనాబాయి, అరుణ, మీరాబాయి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



# పండుగ సాయన్న జయంతి వేళ విగ్రహ భూమిపూజ

## - సర్పంచ్ కూనేరు భూమన్న చేతుల మీదుగా కార్యక్రమం

సారంగాపూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త: మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కూనేరు భూమన్న కొబ్బరికాయ కొట్టి పండుగ సాయన్న విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. 19వ శతాబ్దంలో భూస్వామ్య పాలకులను ఎదిరించి అణగారిన వర్గాలకు అండగా నిలిచిన ధీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులు పాలకులుగా మారాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువత ముదిరాజులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఏకం చేస్తూ నాయకత్వం వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రామగిరి రవీందర్, కల్లూరు సుధాకర్, సారంగాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు సైదు చందు, పాతల గంగాధర్, దొడ నరసయ్య, సైదు నారాయణ, దొడ నరేష్, దొడ రమేష్, కన్నం శేఖర్, దొడ దినేష్, వార్డు మెంబర్ పిల్లి సంతోష్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# ప్యారమూర్ బీరవెల్లి దారిలో పిచ్చి మొక్కల తొలగింపు

సారంగాపూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త: మండలంలోని ప్యారమూర్ గ్రామం నుండి బీరవెల్లి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. శనివారం గ్రామ సర్పంచ్ మకునూరి వరలక్ష్మి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది రోడ్డుకిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమం చేపట్టడంతో ప్రమాదాల నివారణకు కృషి చేసిన సర్పంచ్‌కు బాటసారులు, వాహనదారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

భైంసా, ఆగస్టు 08, ప్రభాతవార్త: భైంసా మండలంలోని దేగాం గ్రామంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోనేగారి పోతన్న, కిష్టన్న ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. 19వ శతాబ్దంలో భూస్వామ్య పాలకులను ఎదిరించి అణగారిన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అన్నం పెట్టి అండగా నిలిచిన ధీరుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులు పాలకులుగా మారాలని పిలుపునిచ్చారు. చదువుకున్న యువత బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఏకం చేస్తూ నాయకత్వం వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బిలి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ పందరి, కిష్టన్న పాతర్ల, నరేష్, గంగాధర్, వీడీసీ చైర్మన్ నాని, లక్ష్మణ్, బెల్లం పోతన్న, సట్ల కిష్టన్న, సున్నపు సాయిలు, వార్డు మెంబర్ ఆనంద్, వివిధ వర్గాల నాయకులు పాల్గొన్నారు.



# మూడో రోజు సిపిఐ ప్రజా పోరుయాత్ర

**బెల్లంపల్లి, ఆగస్టు 08, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరు యాత్ర మూడవ రోజు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కమిటీ సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశంలో ప్రజల జీవన పరిస్థితులు దుర్భరంగా మారుతున్నాయని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగం పెరుగుతోందని, విద్యా మరియు వైద్య రంగాలను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం వల్ల సాధారణ ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా దేశాన్ని సంక్షోభ పరిస్థితులకు నెడుతున్నారని ఆరోపించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లంపూర్ణిమ, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి రాజమోళి, తాండూరు మండల కార్యదర్శి కొండ బానేష్, జిల్లా సమితి సభ్యులు జి సినిమాలు, రత్నం రాజ్యం, నాయకులు బొంకూర్ రామచందర్, రత్నం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.







## ఓటు విలువపై విద్యార్థులకు అవగాహన

### - జెడ్పీఎస్ఎస్ బజార్‌హత్నూర్‌లో మాక్ ఎలక్షన్

**బజార్‌హత్నూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త:**

మన ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు స్థానిక జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జె. భూమన్న ఆధ్వర్యంలో శనివారం "మాక్ ఎలక్షన్" నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రత్యక్షంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్య పద్ధతులపై అవగాహన పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కురుక్షేత్ర పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ ఉత్సవాలు

**బజార్‌హత్నూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కురుక్షేత్ర పాఠశాల ప్రాంగణంలో బోనాల పండుగ ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, తలపైన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. పాఠశాల ప్రాంగణమంతా పోతురాజుల నృత్యాలు, ఘటాల ఊరేగింపు, డప్పు చప్పుళ్లతో మారుమోగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఘనంగా బోనాల ఉత్సవాలు

**భైంసా, ఆగస్టు 08, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్ ప్రాంగణంలో బోనాల పండుగ ఉత్సవాలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ వేడుకలను నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, తలపైన బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. పాఠశాల ప్రాంగణమంతా పోతురాజుల నృత్యాలు, ఘటాల ఊరేగింపు, డప్పు చప్పుళ్లతో మారుమోగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తా

### - కొత్త ఇన్‌చార్జ్ కొండాజీ నరేంద్రచారి

### - మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జ్‌గా నియామకం

**నిర్మల్, ఆగస్టు 08, ప్రభాతవార్త:**

మంచిర్యాల జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్‌గా నియమితులైన బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండాజీ నరేంద్రచారిని శనివారం నిర్మల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నరేంద్రచారి మాట్లాడుతూ.. మంచిర్యాల జిల్లాలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రామ్‌నాథ్, మెడిసిమ్మ రాజు, పొన్నం నారాయణ గౌడ్, రచ్చ మల్లేష్, తోట సత్యనారాయణ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌ఓసీ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**సారంగాపూర్, ఆగస్టు 08, ప్రభాతవార్త:**

సారంగాపూర్ మండలంలోని వంజర్ గ్రామానికి చెందిన ముక్కెర భోజన్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందించే నిమిత్తం మంజూరైన రూ. 2.00 లక్షల ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కును శనివారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్న తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## కుందేలును హతమార్చిన నలుగురిపై కేసు నమోదు

**తాండూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త :**



తాండూర్ మండలంలోని తంగళ్లపల్లి గ్రామానికి చెందిన మండిగ శ్రీకాంత్, టేకం రమేష్, బండి కార్తీక్, దూల రాకేష్ లపై అడవి కుందేలు హతమార్చినందుకు కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి గౌరీ శంకర్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... కొత్తపల్లి గ్రామ శివారులో నలుగురు నిందితులు అడవి కుందేలును హతమార్చి శ్రీకాంత్ ఇంట్లో ఉంచారు. శ్రీకాంత్ ఇంట్లో సోదాలు చేసి చనిపోయిన కుందేలును స్వాధీనం చేసుకున్నారు. దీంతో నలుగురిని అదుపులో తీసుకొని తదుపరి విచారణ నిమిత్తం బెల్లంపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ అధికారులు రాజమణి, గోపికృష్ణ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజమణి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పాల్గొన్నారు.



బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్ రేగళ్ల ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు: రేగళ్ల ఉపేందర్

### - ఎస్ఆర్ఆర్ హై స్కూల్‌లో ఘనంగా బోనాల వేడుకలు

### - అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

**నస్పూర్, ఆగస్టు 8, ప్రభాతవార్త**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని ఎస్ఆర్ఆర్ హై స్కూల్ ప్రిన్సిపాల్ రేగళ్ల ఉపేందర్ పేర్కొన్నారు. నస్పూర్ పట్టణంలోని ఏఎస్ఆర్ఆర్ నగర్‌లోని ఎస్ఆర్ఆర్ హై స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర పండుగ అయిన బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు బోనం పోసి, పోతురాజులు, అమ్మవార్ల వేషధారణలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఉపేందర్ మాట్లాడుతూ బోనాల పండుగ విశిష్టతను, గ్రామీణ దేవతల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బోనం సమర్పించడం వెనుక ఉన్న సంప్రదాయ విశేషాలను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుష్మా, పద్మ, భారతి, సత్యవతి, రాధ, మనోజ, తిరుపతమ్మ, హీనా, మోనిక, భాగ్యలక్ష్మి, మహేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.